## క్లుప్తంగా

### స్థలం కేటాయించాలని వినతి



ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న యువకులు

రొళ్ల: మండలంలోని జీఎస్ పాళ్యం గ్రామంలోని ఎస్సీ కాలనీకి వెళ్లే ముఖ ద్వారం వద్ద అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని కాలనీకి చెందిన యువకులు కోరారు. గురువారం జీఎస్ పాళ్యం చెందిన యువకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలికి వినతి పత్రం సమర్పించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ మాట్లాడుతూ విగ్రహ ఏర్పాటు కోసం అవసరమైన స్థలాన్ని కేటాయించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకుడు రంగస్వామి, కాలనీ వాసులు రాఘవేంద్ర, బసవరాజు, సుకేష్, సదాశివ, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

### శుభకార్యం

అమరాపురం: మండలంలోని గౌడనకుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ డీలర్ రామచంద్రప్ప కుమార్తె లత–రాజశేఖర్ వివాహం అమరాపురంలోని కోపేర్నహోమ్ ప్రార్థన మందిరంలో గురువారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు జె.కె.నరసింహమూర్తి, సోమనాథ్‌గౌడ, శివకుమార్, నాగరాజు, మాజీ రాష్ట్ర క్రిష్టియన్ ఫైనాన్స్ డైరెక్టర్ సుందర్‌రాజు, సాల్మన్‌రాజు తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

### కంది వామికి నిప్పు

లేపాక్షి: మామిడిమాకులపల్లిలో రైతు నరసమ్మకు చెందిన కంది వామికి బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దగ్ధమైంది. ఇటీవల కంది కోతలు పూర్తి కావడంతో పొలంలోనే ఒకచోట కంది వామి వేసింది. అయితే గుర్తు తెలియని వ్యక్తులు కంది పంటున్న వామికి నిప్పు పెట్టడడంతో మొత్తం కాలిపోయింది. అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో.. వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు రైతు నరసమ్మ తెలిపింది.

### యువత క్రీడల్లో రాణించాలి



గెలుపొందిన జట్టుకు కప్ అందజేస్తున్న చలివెందుల సర్పంచ్ ఉపేంద్ర రెడ్డి

హిందూపురం: యువత క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చలివెందుల సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉపేంద్రరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని కొండూరు స్కూల్ క్రీడా మైదానంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో 20 జట్లు పోటీపడ్డాయి. ఫైనల్‌కు హిందూపురం పళనీనగర్, కొండూరు జట్లు చేరుకున్నాయి. గురువారం ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో పళనీ నగర్ జట్టు విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన పళని నగర్ జట్టుకు రూ.10 వేల నగదు బహుమతి, రన్నర్ కొండూరు జట్టుకు రూ.5 వేల నగదు బహుమతితోటు కప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఉపేంద్రరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో క్రీడల్లో పాల్గొంటూ జిల్లా, రాష్ట్రస్థాయిలో ఆడేలా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రెహ్మాన్, షేక్ సద్దాం బాషా, సిసింద్ర, మనోజ్, అజయ్, నారాయణ రెడ్డి, బాబు, దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

### మహిళపై దాడి తగదు

సోమందేపల్లి: పెనుకొండ మండలంలోని మునిమడుగులో వెంకటలక్ష్మి అనే మహిళను వివస్త్రను చేసి, దాడి చేయడం తగదని ఐద్వా అధ్యక్షురాలు గౌతమి అన్నారు. గురువారం సాయినగర్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ మంత్రి సవిత ఒక మహిళ అయి ఉండి కూడా ఆమె సొంత నియోజకవర్గంలో మహిళలకు రక్షణ కరువు అయ్యిందన్నారు. ఈ ఘటనపై మంత్రి స్పందించకపోవడం బాధాకరం అన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో బాధిత మహిళకు న్యాయం జరిగే వరకు పోరాడతామని తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

### రంగసముద్రం అధ్యక్షురాలిగా మారెక్క



అధ్యక్షురాలిని సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని రంగసముద్రం గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా మారెక్క రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఎన్నికలు నిర్వహించారు. ఆమె ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఇదిలా వుంటే గ్రామ పంచాయతీ లో మొత్తం 18 మంది సభ్యులున్నారు. గతంలో ఆమె కాంగ్రెస్ సభ్యుల మద్దతుతో అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఈ సారి కాంగ్రెస్, జేడీఎస్ పార్టీల మద్దతు తో ఆమె అధ్యక్షురాలిగా ఎన్నిక కావడం విశేషం. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలిని గ్రామ పంచాయతీ సభ్యులు సన్మానించారు.

# యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

- పట్టించుకోని అటవీ, రెవెన్యూ అధికారులు
- పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లే ప్రమాదం

పచ్చదనం కాపాడుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అని పాలకులు, అధికారులు ప్రచారం చేస్తున్నా.. కొందరు స్వార్థపరులు పచ్చని చెట్లను నరికి, కలప అక్రమంగా కర్ణాటకకు రవాణా చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. కలప అక్రమ రవాణాపై అటవీ, రెవెన్యూ అధికారులు, పోలీసులు నామమాత్రపు చర్యలు చేపడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.



ట్రాక్టర్ సహాయంతో అక్రమంగా కర్ణాటక ప్రాంతానికి దిమ్మెలు తరలిస్తున్న దృశ్యం

రొళ్ల: కొందరు అక్రమార్కులు ఇష్టానుసారంగా చెట్లను నరికి కర్ణాటక ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలో హొట్టే బెట్ట, రొళ్ల, బీజీ హళ్లి పంచాయతీల పరిధిలో లక్షల ఎకరాలకు పైగా రిజర్వు ఫారెస్ట్ ఉంది. ఫారెస్ట్‌తో పాటు గ్రామాల్లోని పెద్ద పెద్ద వృక్షాలను కొందరు నరికివేస్తూ అక్రమ మార్గంలో కర్ణాటక ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అరికట్టాల్సిన అటవీశాఖ అధికారులు కూడా వ్యాపారులతో లాలూచి పడి మామూళ్లు ఇప్పించుకుని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల ద్వారా కాకుండా కొడగార్లగుట్ట, సోమఘట్ట గ్రామాల మీదుగా అక్రమ మార్గం గుండా కర్ణాటక ప్రాంతం జీడీ పాళ్యం, కల్లహళ్లి మీదుగా మిడిగేశి, హొసకెర శిర, పట్టనాయకనహళ్లికి తరలిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. వృక్షాలను నరికి ట్రాక్టర్ సహాయంతో వందల టన్నులు సరిహద్దులు దాటుతున్నాయి.ఇప్పటికే సక్రమంగా వర్షాలు లేక పంటలు పండగా భూగర్భజల నీటి మట్టం అడుగంటి పోతోంది. ఇప్పటికైనా అధికారులు మేల్కొని వృక్షసంపదను కాపాడుకోకపోతే మండలం పూర్తిగా ఏడారిగా మారేందుకు ఎంతో సమయం పట్టదని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సంబంధితశాఖ ఉన్నతాధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి వృక్ష సంపదను అన్యాక్రాంతం కాకుండా రక్షించడానికి చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### చెట్లు నరికితే చర్యలు

అనుమతి లేకుండా వ్యాపారులు అక్రమంగా చెట్లు నరికితే చర్యలు తప్పవు. కొందరు అనుమతి తీసుకోకుండా చెట్లను నరికి ఇతరాత్ర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ముఖ్యంగా టేకు, వేప, చింత వంటి ఇతరాత్ర చెట్లు అనుమతి తీసుకోకుండా నరికినట్లు తెలిస్తే కేసులు నమోదు చేస్తాం.

– కళ్లాయప్ప, ఇన్‌చార్జ్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్

### వృక్ష సంపద కాపాడాలి



వృక్ష సంపదను అన్యాక్రాంతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. చెట్లు ఉండడం వల్ల సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొందరు స్వార్థం కోసం చెట్లను ఇష్టానుసారంగా నరికి అక్రమంగా తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. దీనిని అరికట్టాల్సిన అధికారులు కూడా పట్టించుకోకపోవడం దురదృష్టకరం.

– దయానంద్, రైతు, సోమఘట్ట

### మొక్కలు పెంచితేనే క్షేమం



మొక్కలు పెంచడం వల్ల ఆహ్లాదకరమైన వాతావరణం లభించడంతో పాటు కాలుష్యాన్ని నియంత్రించవచ్చు. చెట్ల వల్ల వర్షాలు కురిసేందు కూడా వీలుంటుంది. అయితే కొందరు వ్యాపారులు చెట్లను నరికి అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి వృక్ష సంపదను అన్యాక్రాంతం కాకుండా అరికట్టాలి.

– లోకేష్, రైతు, గుడ్డగుర్కి

### నేడు శ్రీరంగరాజుపల్లిలో 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ'

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో శుక్రవారం ఉదయం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'గుడ్ మార్నింగ్ శ్రీరంగరాజుపల్లి...' కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. ఉదయం 7 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పాల్గొంటారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు తప్పక పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్



మాట్లాడుతున్న పెనుకొండ నగర కమిషనర్ సతీష్‌కుమార్

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కమిషనర్ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. నూతన ఇన్‌చార్జ్ కమిషనర్‌గా ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి వార్డులో పర్యటించి సమస్యలను తెలుసుకొని, వాటిని తక్షణమే పరిష్కరిస్తానన్నారు. తాగునీటి సమస్య, విద్యుత్ లైట్లు ఇతర ఏ సమస్య ఉన్నా తన దృష్టిని ప్రజలు తెలపాలని, లేక కౌన్సిలర్ల ద్వారా తెలియజేయాలన్నారు. ఆయన పలువురు కౌన్సిలర్లతో సమస్యలపై చర్చించారు.

## పాడి రైతులకు ప్రభుత్వం అండ



రొద్దంలో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న మంత్రి సవిత

రొద్దం: పాడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. గురువారం మండల కేంద్రంలో రైతు కురుబ చన్నకేశవులు నిర్మించుకున్న మినీ గోకులం షెడ్డును అధికారులతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో గోకులం షెడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. నియోజకవర్గంలో పలు రోడ్లు, పశువులకు గోకులం షెడ్లు, కాలువలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. షెడ్లు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కొత్త షెడ్లు కూడా మంజూరు చేస్తామన్నారు. రెండు పశువులు ఉన్నవారికి రూ 2.30 లక్షలు మంజూరు చేస్తామన్నారు. అనంతరం ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలతో అదనపు భవన నిర్మాణానికి, నల్లూరు నుంచి బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. మండల కేంద్రంలోని గ్రంథాలయం వద్ద నివాసం ఉంటున్న ముస్లిం మహిళలు డ్రైనేజీ, సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయాలని మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామ్‌కుమార్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

### రోడ్ల రూపురేఖలు మారుస్తా

పెనుకొండ: నియోజకవర్గంలోని రోడ్ల రూపు రేఖలు మారుస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళీ శాఖామాత్యులు సవిత పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డుతో పాటు కోనాపురం రోడ్డుకు రూ.1.50 కోట్లతో పనులు చేపట్టడానికి మంత్రి శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ పెనుకొండ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని అన్ని రోడ్లు ఆధునీకరిస్తానన్నారు.

### పాడిపోషణ ద్వారా ఆర్థికాభివృద్ధి

రొళ్ల: నిరేపేద ఎస్సీ, బీసీ రైతులు పాడి పోషణ ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆర్డీటీ ఏటీఎల్ ఓబుళేష్ సూచించారు. గురువారం మండలంలోని రత్నగిరి, పిల్లిగుండ్ల గ్రామంలో ఏడుగురు రైతులకు ఇదివరకే ఆర్డీటీ కొనుగోలు చేసి ఇచ్చిన పాడి ఆవులను ఏటీఎల్ పరిశీలించారు. ఒక్కో పాడి ఆవుకు రూ.70 వేలు చొప్పున ఖర్చు పెట్టామన్నారు. పాడి ఆవులు పెంపకం చేపట్టి నిరుపేద ఎస్సీ, బీసీ కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతుండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అయితే ప్రభుత్వం ఇటీవల ఉపాధి, పశువైద్యశాఖ సంయుక్తంగా కలిసి గోకులం షెడ్డును మంజూరు చేస్తోంది. దీంతో తమకు గోకులం షెడ్డు మంజూరు చేయాలని నాయకులు, అధికారుల చుట్టు తిరిగినా పట్టించుకోవడం లేదని పాడి రైతులు వాపోయారు. తాము ఆవులను పెంచి పోషిస్తున్న కూడా గోకులం షెడ్డును మంజూరు చేయలేదన్నారు. ఆవులు లేని వారికి గోకులం షెడ్డు మంజూరు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. గత్యంతరం లేక స్వంత ఖర్చులతో షెడ్డును ఏర్పాటు చేసుకుని పాడి ఆవులను పెంచి పోషిస్తున్నామని రైతులు తెలిపారు.

### క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న డీఈఓ కృష్ణప్ప

పుట్టపర్తి: శ్రీసత్యసాయి జిల్లా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను డీఈఓ కృష్ణప్ప గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యపరంగా జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ప్రతినిధులు డీఈఓకు మాజీ రాష్ట్రపతులు సర్వేపల్లి రాధకృష్ణన్, అబ్దుల్ కలామ్ ప్రతిమలను అందించారు. జిల్లా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్‌జిల్లా జిల్లా అధ్యక్షుడు రియాజ్, పుట్టపర్తి నియోజకవర్గ అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు ప్రభాకర్, బుక్కపట్నం సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

### జూదరుల అరెస్ట్

గుడిబండ: మండల కేంద్రంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. మండల కేంద్రలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ రాజకుళ్లాయప్ప, పోలీస్ సిబ్బంది కలసి గురువారం సాయంత్రం పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ. 4150 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్ కానిస్టేబుల్ మహమ్మద్‌రఫి, పాతన్న పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 8,9 తేదీల్లో రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నీ



మాట్లాడుతున్న ఆర్గనైజింగ్ కార్యదర్శి జాకీర్ హుసేన్

ధర్మవరం అర్బన్: యువర్స్ ఫౌండేషన్ సహకారంతో ఫిబ్రవరి 8,9 తేదీల్లో రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నీ నిర్వహించనున్నట్లు హైబ్రో చెస్ అకాడమీ ఆర్గనైజింగ్ కార్యదర్శి జాకీర్ హుసేన్, ఉషోదయ పాఠశాల కరస్పాండెంట్ చాంద్‌బాషా తెలిపారు. స్థానిక కొత్తపేటలోని ఉషోదయ పాఠశాలలో గురువారం వారు మాట్లాడారు. టోర్నీలో ప్రవేశ రుసుం రూ.600 ఉంటుందన్నారు. చెస్ క్రీడాకారులకు ఉచిత భోజనం, వసతి ఏర్పాటు చేస్తామని తెలిపారు. టోర్నీ ఏపీ స్టేట్ అసోసియేషన్ కార్యదర్శి సుమన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని ముఖ్య అతిథులుగా ఏపీ స్టేట్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, ఉమ్మడి జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి రవిరాజ్, టోర్నీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బీవీ సుబ్బారావు హాజరవుతారన్నారు. టోర్నీలో మొత్తం నగదు బహుమతి రూ.60వేలు అని తెలిపారు. వివరాలకు 9912647370, 08559–221813 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు షీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి మోహన్, కోటేశ్వరరావు, టోర్నీ ఆర్గనైజర్ డైరెక్టర్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

### మాజీ సైనికులకు ఘన సన్మానం

ధర్మవరం అర్బన్: ఆర్మీడేను పురస్కరించుకుని మాజీ సైనికులకు ఘనంగా సన్మానించినట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు షీలా నాగేంద్ర, ఉపాధ్యక్షుడు సుంకు సుకుమార్, కార్యదర్శి జయరాం తెలిపారు. పట్టణంలోని యువర్స్ ఫౌండేషన్ కార్యాలయంలో గురువారం మాజీ సైనికులు రేణిగుంట శ్రీధర్, వంకదారు మోహన్‌ను శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. సైనికుల వల్లనే భారతదేశ ప్రజలంతా సంతోషంగా జీవిస్తున్నారని, వారు బార్డర్‌లో ప్రజలందరికి రక్షణగా నిలుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ సభ్యులు పోలా ప్రభాకర్, చాంద్‌బాషా, డాక్టర్ బీవీ సుబ్బారావు, వైకే శ్రీనివాసులు, కోటేశ్వరరావు, కౌన్సిలర్ పెనుజూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### 21 నుంచి ఫింఛన్‌దారుల సర్టిఫికెట్ల పరిశీలన

ధర్మవరం రూరల్: ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు సంబంధించి ఈ నెల 21, 22 తేదీల్లో ఫింఛన్‌దారుల ఆరోగ్య పరిస్థితులు, హెల్త్ సర్టిఫికెట్లను వైద్య బృందం పునఃపరిశీలన చేయనుంది. ఈమేరకు ఎంపీడీఓ సాయిమనోహర్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇది వరకే పింఛన్‌దారులకు నోటీసు పంపామని, నోటీస్ అందుకున్న పింఛన్‌దారులు ఇంటి వద్దనే ఉండి వైద్యుల బృందానికి సహకరించాలని పేర్కొన్నారు. ఈ నెల 21న ఏలుకుంట్ల, నేలకోట, దర్శనమల, రావులచెరువు, ధర్మపురి, మల్లాకాలువ, సీసీకొత్తకోట గ్రామాలకు చెందిన 20 మంది పింఛన్‌దారులు, అలాగే 22న రేగాటిపల్లి, కుణుతూరు, పోతుకుంట, చిగిచెర్ల, గొట్లూరు, తుమ్మల, మల్కాపురం గ్రామాలకు చెందిన 26 మంది పింఛన్‌దారులకు సంబంధించిన సర్టిఫికెట్లతో పాటు వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలిస్తారని తెలిపారు.

## 19న యోగి వేమన జయంతి



వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డితో మాట్లాడుతున్న రెడ్డి సంఘం నాయకులు

హిందూపురం: ఈనెల 19వ తేదీన యోగి వేమన జయంతి నిర్వహిస్తున్నట్లు ముద్దిరెడ్డిపల్లి రెడ్డి సంఘం కమిటీ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ముద్దిరెడ్డి పల్లి, భాగ్యనగర్, వాల్మీకి సర్కిల్ వరకూ వేమన చిత్రపటాన్ని ఊరేగిస్తామన్నారు. ప్రజలందరూ వేడుకలకు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

**వేమన జయంతికి ఆహ్వానం**

హిందూపురం: మహాకవి యోగి వేమన జయంతి సందర్భంగా ఈనెల 19వ తేదిన రెడ్డి సంఘం ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు రెడ్డి సంఘం నాయకులు తెలిపారు. ర్యాలీ, జయంతి ఉత్సవాలకు రావాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డిని ఆహ్వానించారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద నుంచి ఆటోనగర్ క్రాస్ వద్ద వేమన విగ్రహం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం మహాకవి వేమన విగ్రహానికి నివాళులర్పిస్తామని పేర్కొన్నారు.

## పెనుకొండ అభివృద్ధికి కృషి చేస్తాం

- మున్సిపల్ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని నగర పంచాయతీ మున్సిపల్ చైర్మన్ ఉమర్‌ఫారూక్ ఖాన్ తెలిపారు. గురువారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో పాలక వర్గ సమావేశం వాడీవేడిగా జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ మాట్లాడుతూ పెనుకొండలో పశువులు, కుక్కల బెడదతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇటీవల పశువుల దాడిలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో ఏ సమస్య ఉన్నా, పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రతి వార్డులో పర్యటించి అన్ని సమస్యలపై నివేదిక సిద్ధం చేసి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో కోఆప్షన్ మెంబర్ నేమతుల్లా మాట్లాడుతూ ఇటీవల జరిగిన బాబయ్య గంధం, ఉరుసు వేడుకల్లో నగర పంచాయతీ అధికారులు వ్యవహరించిన తీరు సరిగా లేదన్నారు. దీని వల భక్తులు ఎంతో ఇబ్బంది పడ్డారని, కనీసం ఒక్క ప్రజాప్రతినిధిని కూడా అధికారులు సంప్రదించలేదన్నారు. కౌన్సిలర్లు సద్దాం, తయూబ్, రఘునాథరెడ్డి విద్యుత్ లైట్లు, డ్రైనేజ్ క్లీనింగ్, తాగునీటి సమస్యపై అధికారులను ప్రశ్నించారు. స్పందించిన కమిషనర్ సతీష్‌కుమార్ పూర్తి స్థాయిలో పరిశీలించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో పలు అభివృద్ధికి సంబంధించిన విషయాలపై చర్చించి, వాటిని సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు భాస్కర్‌నాయక్, శేషాద్రి, వెంకటరామిరెడ్డి, చంద్రకళ, అంజలి, ఫర్జియాభాను, షహనాబి, తదితరులు పాల్గొన్నారు.

### వివేకానందను ఆదర్శంగా తీసుకోండి



మాట్లాడుతున్న స్వామి జపానంద

పావగడ: స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని నేటి యువత దేశ సేవ చేయడం అలవర్చుకోవాలని స్థానిక రామకృష్ణ సేవాశ్రమ అధిపతి స్వామి జపానంద పిలుపునిచ్చారు. గురువారం తుమకూరు విశ్వ విద్యాలయంలో స్వామి వివేకానంద 162వ జయంతి, జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. స్వామి వివేకానంద గీతాలను జపానంద శ్రావ్యంగా ఆలపించారు. వైస్ చాన్సలర్ వెంకటేశులు మాట్లాడుతూ.. వివేకానంద స్ఫూర్తితో భారతదేశ అభివృద్ధికి నేటి యువత కంకణబద్ధులు కావాలన్నారు.



దారి పొడవునా ముళ్ల కంపలు ఏపుగా పెరిగిన దృశ్యం

## కర్షకులకు 'దారి' కష్టాలు..!

వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు కర్షకులకు దారి కష్టాలు తప్పడం లేదు. గుడిబండ మండల పరిధిలోని ఫళారం గ్రామం నుంచి కొంకల్లు గ్రామానికి వెళ్లేందుకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో దారి ఏర్పాటు చేశారు. దారికి ఇరువైపులా ముళ్ల చెట్లు ఏపుగా పెరిగి వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు రైతులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు పండించిన పంటను తరలించేందుకు అవస్థలు తప్పడం లేదు. సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించుకున్నా కనీసం పరిశీలించిన దాఖలాలు లేవు. దశాబ్దాల క్రితం చేపట్టిన మార్గాలకు మరమ్మతులు చేపట్టడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ముళ్ల పొదలను తొలగించాల్సిన అవసరం ఉంది. గుంతలను కంకరతో పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఫళారం గ్రామ రైతులు, ప్రజలు కోరుతున్నారు.

– గుడిబండ:

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచిన వారు సంప్రదించండి.

హిందూపురం డివిజన్

9912220717, 9912220723
9705346587, 9912220726